RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 231 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 20-8-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు,శ్రావణ మాసం, తిథి॥ అష్టమి రా॥9.50, విశాఖ ఉ॥11.02, వర్జ్యం మ॥ 3.25-5.10,
దుర్ముహూర్తం ఉ॥ 9.58-10.48, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥ 1.30-3.00, సూర్యోదయం ఉ॥ 5.45, సూర్యాస్తమయం సా॥ 6.26 గం॥

## 'స్వాప్ దానం'కు అవకాశం

**-శాసనసభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**-మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుకు సభ ఆమోదం**



**అమరావతి, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** జీవన్మృతుల(బ్రెయిన్ డెడ్) వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.10 వేల నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను సీఎం పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాలను వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి 8 అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని మంత్రి తెలిపారు. 5,920 మంది నిరీక్షణ రాష్ట్రంలో 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

## రైలు, రహదారి మౌలిక సదుపాయాలకు పెద్దపీట

**-రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం**

**-కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు**



**న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు- గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించార. రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. లాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్- సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు.

# గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కోకొల్లలు

**-అనర్హులతో పేపర్లు దిద్దించిన ఘనత ఆనాటి వైసిపిది -ప్రైవేట్ ఏజెన్సీలకు పేపర్లు దిద్దే బాధ్యత అప్పగింత**

**-ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులకు అప్పగింత -అసెంబ్లీలో ఆనాటి దుర్మార్గాన్ని ఏకరువు పెట్టిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. 'గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారని నిలదీసారు. మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు. తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారని ఆనాటి అక్రమలాపై చంద్రబాబు ఏకరువు పెట్టారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు



దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైందన్నారు. వైకాపా హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాల్సిందేని చంద్రబాబు అన్నారు. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదని సీఎం అన్నారు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 315 ప్రకారం ఏపీపీఎస్సీ ఏర్పడిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సర్వీసుల్లోకి వచ్చే అధికారులను గ్రూప్-1 పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధిస్తారని చెప్పారు. అలాంటి పరీక్షల్లో గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజలు, ఉద్యోగార్థులు ఈ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## త్యాగం మీది.. అండ మాది

**-వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం**

**-నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**-ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు**



**అమరావతి, ఆగస్ట్ 19 (ఆర్ఎన్ఏ):** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి మిగతా 2లో..



## ఈ నెలాఖరులో నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు

**-ప్రాజెక్టు పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసిన ఘనత వైసిపి పార్టీదే**

**-మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**అమరావతి, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు.కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులోమిగతా 2లో..


## ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**-రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టాం**

**-రెండేళ్లలో రూ.1800 కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి**

**-అసెంబ్లీలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో ఇటీవలే పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో నాడు చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని



పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు మిగతా 2లో..

## మండలిలో డిఎస్సీపై వైసిపి వాయిదా తీర్మానం

**తిరస్కరించిన ఛైర్మన్.. కాసేపు మండలి వాయిదా**

**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. బుధవారం శాసనమండలిలో మెగా డీఎస్సీపై వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ వాయిదా తీర్మానాన్ని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆందోళనతో శాసనమండలిలో గందరగోళం నెలకొంది. డీఎస్సీపై చర్చ పెట్టాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. పోడియాన్ని చుట్టుముట్టి ఆ పార్టీ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మెడలో నల్ల కండవాలతో ఆ పార్టీ సభ్యులు సభకు వచ్చారు. వైసీపీ సభ్యులు ఆందోళనతో ఏపీ శాసన మండలిని ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. వైసీపీ సభ్యులు సభను గౌరవించటం లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఛైర్మన్ సభను ఆర్డర్‌లో పెట్టాలని సూచించారు. ఛైర్మన్ టేబుల్‌ను కొడుతూ ఎందుకు మిగతా 2లో..

## ప్రత్యక్ష ఎన్నికలతో ప్రయోజనాలు

**-నేరుగా ఎన్నికైన వారికి ప్రజల్లో ఆదరణ**

**-అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి**



**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్, మున్సిపల్ ఛైర్మన్ ఎంపికతో అనేక ప్రయోజనాలు ఉంటాయని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎన్నికల్లో నేరుగా ఎంపికైన వారికి బలమైన ప్రజామోదం ఉంటుందని అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌పై ఉండదని స్పష్టం చేశారు. వీరిద్దరు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే సుదీర్ఘ అభివృద్ధి ప్రణాళికలు అమలుపరిచే అవకాశం ఉంటుందని అన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయవచ్చునని చెప్పారు. పెట్టుబడిదారులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని మేయర్, ఛైర్మన్ యాక్టివ్‌గా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వీరిద్దరిపై రాజకీయ ప్రభావం తగ్గుతుందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకూ అవసరమైన పనులు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. అంతకుముందు అసెంబ్లీలో పురపాలక శాసనాల 4వ సవరణ బిల్లును మున్సిపల్ పరపాలన శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన చట్ట సవరణ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

## కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదుల తరలింపు

**నసీర్ మాద్నీ సంచలన వ్యాఖ్యలు**

**లాహోర్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని బహావల్‌నగర్‌లో ఆగస్టు 14న జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన నసీర్ మాద్నీ కశ్మీర్ గురించి పలు సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఉగ్రసంస్థ ఎల్‌ఈటీ చీఫ్ హఫీజ్ సయీద్ కశ్మీర్‌లోకి 10 వేల మంది ఉగ్రవాదులను పంపించినట్టు చెప్పాడు. దీంతో, కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం అవుతోంది. హఫీజ్ సయీద్ సారథ్యంలోని లష్కరే తొయిబా భారత్‌లో దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి హఫీజ్‌పై పలు కేసులు నమోద య్యాయి. 26/11 దాడుల్లో మంది పాక్ ఉగ్ర వాదులు సముద్రమార్గంలో ముంబైలోకి ప్రవే శించి 4 రోజుల పాటు మారణ హోమం సృష్టించారు. ఈ ఉగ్రవాద దాడిలో 166 మంది మరణించగా 300 మంది గాయపడ్డారు. ఇక గతేడాది పహల్గాం దాడిలో 26 మంది సాధారణ పౌరులు కన్నుమూసిన విషయం తెలిసిందే.

## ఇరాన్ క్షిపణి దాడులపై అరబ్ ఆగ్రహం

**ఇరాన్‌తో వాణిజ్య బంధాన్ని తెంచుకుంటున్నట్లు ప్రకటన**




**న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** ఇరాన్‌తో అన్ని వాణిజ్య, ఆర్థిక లావాదేవీలను నిలిపివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణి దాడుల నేపథ్యంలో యూఏఈ ఈ చర్య తీసుకుంది. ప్రాంతీయ ఉద్రిక్తతల దృష్ట్యా... ఇరాన్‌తో అన్ని వాణిజ్య, వ్యాపార వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలను తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు నిలిపివేశామని యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అఫ్రా అల్ హమెలీ తెలిపారు. మరో క్షిపణి ముప్పు గురించి దేశ ప్రజల్ని హెచ్చరిస్తూ ఫోన్ అలర్ట్ జారీ చేసిన దాదాపు రెండు గంటల తర్వాత యూఏఈ ఈ ప్రకటన చేసింది. 'ప్రస్తుత పరిస్థితి, క్షిపణి ముప్పు కారణంగా, వెంటనే ప్రజలు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ సదరు ఫోన్ అలర్ట్‌లో పేర్కొంది. అయితే, ఆ అలర్ట్‌ను కొద్దిసేపటికే ఉపసంహరించారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైనప్పటి మిగతా 2లో..

## నీట్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరం

**నీట్ ప్రశ్నపత్రం పిటిషన్లపై సుప్రీంలో విచారణ**

**న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి మిగతా 6లో..

## 'జూక్-3' రాకెట్ ప్రయోగం విజయవంతం

**అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు**



**చైనా, ఆగస్టు 19:** అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు వేసింది. 'జూక్-3' రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న 'లాంగ్ మార్చ్-10బీ' రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూ ఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వినియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

**స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు**

-మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి 6లో

**మహాబలిపురంలో దక్షిణాది రాష్ట్రాల సిఎంల భేటీ**

-అమిత్ అధ్యక్షతన భేటీకి సిఎం చంద్రబాబు హాజరు

**ఏపి ఓమ్నిబస్ బిల్లుకు శాసనసభ ఆమోదం**

అసత్యమైనదానికి దూరంగా ఉండండి, సత్యాన్నే అంటిపెట్టుకొని ఉండండి. మనం విజయం సాధించగలం. ఆలస్యమైనా విజయం సాధించి తీరుతాం.

మిగతా 2లో..

# పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయండి

**- డీసీసీ అధ్యక్షులు రమేష్ పిలుపు - ఘనంగా నూతన డీసీసీ, మండల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం**



**చిత్తూరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు డీసీసీతో పాటు మండల కమిటీల ప్రతినిధులు అవిరామంగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షులు దెయ్యాల రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన డీసీసీ, మండల కమిటీల ప్రతినిధులు బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎల్జీబీ టవర్స్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీసీసీ క్రీడల విభాగం చైర్మన్ జీవీవీఎస్ కమలాకరరావు హాజరయ్యారు. ఈ క్రమంలో డిసిసి అధ్యక్షులు రమేష్ బాబు 34 మందితో కూడిన డిసిసి కమిటీ, 23 మంది మందితో కూడిన మండల కమిటీల నూతన కార్యవర్గ ప్రతినిధుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వస్తేనే దేశం బాగుపడుతుందని తెలిపారు. నేడు ప్రధాని మోదీ సర్కార్ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతోందని ఆరోపించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ తో పాటు, ఇతర కుంభకోణాల్లో బిజెపి సర్కార్ బిజీగా పయనిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి రాహుల్ గాంధీ ప్రధాని కావడమే ప్రత్యామ్నాయమని తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిలారెడ్డి సైతం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులందరూ ఐక్యంగా కష్టించి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ లోకేష్ రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ టిక్కీ రాయల్, పూతలపట్టు ఇంచార్జ్ ప్రభాకర్, గుడిపాల మండల అధ్యక్షులు జీ సెల్వం తోపాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు పోష్ చట్టం రక్షణ కవచం

**- అపోలో సదస్సులో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు గద్వాల్ సలీం**



**చిత్తూరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పని ప్రదేశాలు, విద్యా సంస్థల్లో మహిళల భద్రతకు పోష్ చట్టం బలమైన రక్షణ కవచంలా పనిచేస్తుందని చిత్తూరు జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు గద్వాల్ సలీం పేర్కొన్నారు. అపోలో విశ్వవిద్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను విశదంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ప్రతి విద్యాసంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి అని తెలిపారు. మహిళల భద్రతకు న్యాయ పరిరక్షణ బలంగా ఉందని, సుప్రీం కోర్టు పలు తీర్పులు దీనికి ఉదాహరణలని తెలిపారు. అపోలో విశ్వవిద్యాలయం ముందుచూపుతో మహిళలకు సురక్షిత వాతావరణాన్ని కల్పించడం అభినందనీయమని కొనియాడారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు పోష్ చట్టం కవచంలా పనిచేస్తుందని, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ డా.హిమాబిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి: సీఐ



**పలమనేరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పలమనేరు అర్బన్ సిఐ కె. మోహన్ రెడ్డి, పలమనేరు అర్బన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, అలాగే మహిళలపై జరిగే నేరాలు (క్రైమ్స్ అగైనెస్ట్ విమెన్) గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింక్‌లను నమ్మరాదని సూచించారు. అదేవిధంగా గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, విద్యపై దృష్టి సారించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు అత్యవసర సహాయ సేవల గురించి కూడా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కన్నయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బీసీలకు చట్ట సభల్లో 34 శాతం రిజర్వేషన్ హర్షనీయం

**- జిల్లా టిడిపి అధ్యక్షులు షణ్ముగరెడ్డి**

**- కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన బీసీలు**

**చిత్తూరు,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్టసభల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుదేశం బీసీ విభాగం నేతలు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు షణ్ముగరెడ్డి మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ బీసీల అభివృద్ధి కాంక్షిస్తూ బీసీలకు అనేక పదవులను అప్పగించిందన్నారు.. రాష్ట్రంలో బీసీలదరూ తెలుగుదేశం పార్టీని తమ సొంత పార్టీగా భావిస్తారని తెలిపారు. బీసీలపై చిత్తశుద్ధిని మరోమారు రుజువు చేస్తూ చట్టసభల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించడం పట్ల రాష్ట్రంలోని యావత్తు బీసీలు తెలుగుదేశానికి అండగా ఉంటారని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో చుడా చైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, మాజీ కార్పొరేటర్ నళిని తిరుకుమరన్, పార్టీ నాయకులు త్యాగరాజన్, సికె లావణ్య వెంకటేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్, ఈశ్వర్ బాబులతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, బీసీ విభాగం నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక జిల్లా కోర్టు నుంచి పిసిఆర్ సర్కిల్లోని పూలే విగ్రహం వరకు టిడిపి బీసీ విభాగం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు.

## బీసీలకు 34% రిజర్వేషన్ సామాజిక న్యాయానికి నిదర్శనం

**- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు**



**రామకుప్పం,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర జనాభాలో 50.42% ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు పునరుద్ధరించడం సామాజిక న్యాయానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ గౌనివారి శ్రీనివాసులు బుధవారం ఓ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 1987లో స్వర్గీయ ఎన్టీఆర్ 20%తో బీసీ రిజర్వేషన్లకు నాంది పలికారని, 1995లో చంద్రబాబు దాన్ని 34%కి పెంచి రెండు దశాబ్దాల పాటు విజయవం తంగా అమలు చేశారని గుర్తు చేశారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 34% రిజర్వేషన్లను 24%కి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పో యారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మళ్లీ 34% రిజర్వేషన్లను పునరుద్ధరించి బీసీలకు అండగా నిలిచిందని కొనియాడారు. కుప్పం మునిసిపల్, రామకుప్పం, కుప్పం, గుడిపల్లె, శాంతిపురం నాలుగు మండలాల్లో బీసీ జనాభా అధికంగా ఉండటంతో మునిసిపల్ కౌన్సిలర్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వారికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్సీ ఆశాభావం వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం 1.17 కోట్ల మంది బీసీలకు రూ.32,534 కోట్ల ఆర్థిక సహాయం అందించిందని, గీత కార్మికులు, నేతన్నలు, మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులు, వడ్డెర వంటి వృత్తిదారులకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. 70 వేలకు పైగా బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. "బీసీలను కేవలం సంక్షేమ లబ్ధిదారు లుగా చూడటం లేదు. రాజకీయంగా, ఆర్థికంగా బలమైన వర్గంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. బీసీ అభివృద్ధి అంటేనే రాష్ట్ర అభివృద్ధి" అని ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో కుప్పం నియోజకవర్గంలో బీసీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొని ఉన్నదని ఆయన అన్నారు.

# పేదల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం

**- మండల టీడీపీ అధ్యక్ష మాజీ అధ్యక్షులు వి.రమణ అంజనేయరెడ్డి**



**రామకుప్పం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో పేద ప్రజల, అణగారిన వర్గాల కుటుంబాల సంక్షేమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని రామకుప్పం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షులు వి.వెంకటరమణ ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు రామకుప్పం సమీపాన గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మిట్టపల్లి గ్రామానికి చెందిన బంగారు కుటుంబాల వారికి మేఘ ఇంజనీరింగ్ కంపెనీ వారి సహకారంతో ఆటోలు కొనడానికి రూ.లక్ష 60 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 పథకం ద్వారా పేద కుటుంబాలను స్వయం ఉపాధి వైపు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలు అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అండగా నిలుస్తున్నాయని, ఆటో సహాయంతో రాజశేఖర్, నాగరాజు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి సహాయాలు గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఆశలను నింపుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని కుటుంబాలకు ఈ విధంగా సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు సీతాపతి, రామకృష్ణప్ప, పద్మనాభరెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, రవి, మంజునాథ్ రెడ్డి, నవీన్, టీవీ రవి, అవినాష్ రెడ్డి, ఆదిల్, పి4 ఏరియా కోఆర్డినేటర్ వినాయక రెడ్డి సైదాబీ, పంచాయతీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుకు అదనంగా ఐదెకరాల స్థలం కేటాయించాలి

**- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి**

**ములకలచెరువు,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు అదనంగా ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని ఏపి రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. బుధవారం తహసీల్దార్‌తో ఆయన చర్చించారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో స్థలం సరిపోకపోవడంతో రైతులు, టమోటా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మార్కెట్ యార్డుకు టమోటా లోడ్‌తో వచ్చే వాహనాలకు తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో నేషనల్ హైవే పక్కన, సమీపంలోని ఎపిఎస్ఆర్ టిసి డిపో పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలిపివేస్తున్నారని వివరించారు. దీంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు రైతులు, వాహనదారులు, పోలీసుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ములకలచెరువు మార్కెట్‌కు టమోటా సరుకు వస్తుండటంతో భవిష్యత్తులో వాహనాల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డు పక్కన ఉన్న ఐదెకరాల స్థలాన్ని కేటాయించి, పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రంగారెడ్డి కోరారు. రైతు సంఘం ప్రతిపాదనపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు రంగారెడ్డి తెలిపారు. రైతుల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ములకలచెరువు సిపిఐ మండల కార్యదర్శి అంజనప్ప, నిజాముద్దీన్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా

# బీసీలకు ఒకే రోజు రెండు పండుగలు

**- వడ్డెర మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం**

**- 34 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం**

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగం**



**చిత్తూరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు ఒకే రోజు రెండు పండుగలు వచ్చినట్లుగా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం అన్నారు. బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం హర్షణీయమని, అదే విధంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పి.షణ్ముగం మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 34 శాతం రిజర్వేషన్లపై కీలక నిర్ణయం తీసుకోవడం బీసీ వర్గాలకు ఎంతో ప్రాధాన్యమైన విషయమన్నారు. బీసీ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళ రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం ద్వారా బీసీ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరిగిందని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, వారి అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. 34 శాతం రిజర్వేషన్ నిర్ణయం బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం బీసీ వర్గాల భవిష్యత్ తరాలకు సైతం ప్రయోజనం చేకూర్చే చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. బీసీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని వివరించారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రమాదేవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించినందుకు బీసీ వర్గాల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు, భారతీయ జనతా పార్టీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి యావత్ బీసీ వర్గాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంతో పాటు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో కూడా మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ అగ్రనేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీ వర్గాలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లు 25 శాతంకు తగ్గించి బిసి వర్గాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించారని... అందుకే రాష్ట్రంలోని బీసీ వర్గాలు వైసీపీకి తగు గుణపాఠం చెప్పి కేవలం11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా వైసీపీ బుద్ధి తెచ్చుకొని వెనుకబడిన వర్గాల మనోభావాలకనుగుణంగా నడుచుకోకపోతే మరోసారి బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని షణ్ముగం హెచ్చరించారు.

# మా పొలాలు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు

**- మాకు న్యాయం చేయండి రైతులు ఆవేదన**



**పుంగనూరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని ఆరడి గుంట పంచాయతీ అమ్మిగాని పల్లి గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ మా పొలాలను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని.. రెవిన్యూ అధికారులు, పోలీస్ అధికారులు మాకు న్యాయం చేయాలని బుధవారం విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మాకు 1994 ఆరడిగుంట రెవెన్యూ దాఖల సర్వేనెంబర్ 254/2 లో ప్రభుత్వం వారు 5 ఎకరాల 39 సెంట్లు భూమిని డికేటి పట్టాలు ఇచ్చారని, ఆ భూమిని అప్పటి నుండి ఇప్పటివరకు సాగు చేసుకునే జీవనం చేస్తున్నామన్నారు. అయితే 18-8-2026 మంగళవారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ తన అనుచరులు దాదాపుగా 50 మంది వచ్చి ప్రభుత్వం వారు మాకు ఇచ్చిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి డ్రిప్ పైపులను ధ్వంసం చేసి, వ్యవసాయ పంటకు ఉన్న కట్టెలను ధ్వంసం చేసి వారికి అడ్డం వచ్చిన వారిని కొట్టి వారి సెల్ ఫోన్ లాక్కొని వారిని బెదిరించి ఈ భూమిలోకి మీ రైతులు ఎవరైనా వస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. గతంలోనూ ఈ భూమి మాదని కొంతమంది దౌర్జన్యానికి పాల్పడడంతో ఈ భూమి మీద కోర్టుకు వెళ్లమని హైకోర్టు వారు సదరు భూమి మాకే చెందుతుందని ఉత్తర్వులు కూడా ఇచ్చి ఉన్నారని, ఆ ఉత్తర్వులను పుంగనూరు తహసిల్దార్ వారికి 2-2-2026వ తేదీ సమర్పించడం జరిగిందని, హైకోర్టు ఉత్తర్వులు తహసిల్దార్ పరిశీలనలో ఉందని, తహసిల్దార్ వారు పూతలపట్టు ఎక్స్ ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను పిలిపించి విచారించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. విషయమై పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేస్తామని అలాగే ఎంఆర్ఓ దృష్టికి తీసుకు వెళ్తామని రైతులు తెలిపారు. పోలీస్ శాఖ అధికారులు రెవిన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నామన్నారు

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



**పుంగనూరు,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుంగనూరు పాత బస్టాండ్ కూడలిలో ఫోటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ నిర్మాణకర్త లూయిస్ డాగుర్రే చిత్రపటానికి పుంగనూరు సీఐ సుబ్బరాయుడు, ఎస్సై రమణల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గత 30 సంవత్సరాలుగా పుంగనూరులో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని యూనియన్ సభ్యులు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ, ఫోటోగ్రాఫర్ల సేవలు సమాజంలో ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు చంద్ర,పతి, ఉదయ్ మరియు అధ్యక్షులు నాగరాజ, ఉపాధ్యక్షులు బండి బాలు, కోశాధికారి అశోక్ మరియు మాజీ అధ్యక్షులు శేఖర్, కరుణాకర్,కగ్గన్ శేఖర్, యూనియన్ సభ్యులు మురళి, శివ, యస్.జి. శ్రీనివాసులు, ఆంజి, రఘురాజు, నవీన్, మల్లిఖార్జున, వేణు, కేశవ,ధ్రువన్ శేఖర,మణికంఠ, మహేష్,కిరణ్, ప్రభాకర ఫోటోగ్రాఫర్ల యూనియన్ సభ్యులు ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు



**పలమనేరు,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితకి, కూటమి ప్రభుత్వానికి సంచార జాతుల సంఘం తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న తెలుగుదేశం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 1986లో దివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావుతొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చిజిల్లా మండల ప్రజా పరిషత్తులలో అమలు చేశారు.1995లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బీసీ రిజర్వేషన్‌ను 34 శాతానికి పెంచారు. 2001, 2006, 2013లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగింది.ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం జీవో నెం. 76 తీసుకువచ్చి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను 24.5 శాతానికి తగ్గించి బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది.దీని ఫలితంగా 16,800 మంది బీసీలు రాజకీయ పదవులు కోల్పోయారు. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలిచింది. అంతేకాకుండా బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువస్తున్నందుకు కూడా కృతజ్ఞతలు. అతి సాధారణమైన అంగన్వాడీ కార్యకర్త అయిన దలవాయి రమాదేవి అనే వడ్డెర మహిళకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం, టీడీపీకి బీసీలపై ఉన్న ప్రేమకు, చిత్తశుద్ధికి నిదర్శనం.అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతుల సంక్షేమం కోసం 2016లో జీవో నెం.17 ద్వారా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి అత్యంత వెనుకబడిన కులాలకు, సంచార జాతులకు రాజకీయ అవకాశం కల్పించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని లాయర్ రవి తెలిపారు.

# మిట్స్ వర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధకులకు ఓరియంటేషన్

**- సమస్యల పరిష్కారమే పరిశోధన లక్ష్యం కావాలి: ఎస్.వి.సత్యనారాయణ**




**మదనపల్లె,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో జూలై 2026 సెషన్‌కు నూతనంగా చేరిన పీహెచ్‌డీ పరిశోధకులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్, కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఎస్.వి. సత్యనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.పీహెచ్‌డీ కేవలం డిగ్రీ కోసం కాకుండా సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు, కొత్త అంశాలను అన్వేషించేందుకు దోహదపడాలని ఎస్.వి. సత్యనారాయణ సూచించారు. “ఎక్సలెన్స్‌కు డీఎన్ఏ పరిశోధనే” అని పేర్కొంటూ పరిశోధకులు విమర్శనాత్మక ఆలోచన, విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. ముందుగా సమస్యను గుర్తించి, దానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించాలని సూచించారు.ఏఐ, చాట్‌జీపీటీ వంటి సాధనాలను పరిశోధనకు సహాయకులుగా మాత్రమే ఉపయోగించుకోవాలని, “ఏఐ మీ అసిస్టెంట్‌గా ఉండాలి.. మీ మెదడుగా కాదు” అని స్పష్టం చేశారు. ప్లేజరిజం, డేటా మానిప్యులేషన్ వంటి అనైతిక విధానాలకు దూరంగా ఉండాలని, పరిశోధనా నైతికతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, డైరెక్టర్-అడ్మిషన్స్ డాక్టర్ దీపాంకర్ రాయ్, అడ్వైజర్ (ఆర్‌అండ్‌డీ) డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ (ఆర్‌అండ్‌డీ) పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ డాక్టర్ ఎన్.నంద కుమార్ రెడ్డి, విభాగాధిపతులు, పీహెచ్‌డీ పరిశోధకులు పాల్గొన్నారు.

# వల్లూరు గంగమ్మ తల్లి ఆలయానికి బీరువా విరాళం



**రాయచోటి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**రాయచోటి మండలం వల్లూరు వాండ్లపల్లెలోని వల్లూరు గంగమ్మ తల్లి దేవస్థానంలో నూతనంగా పోతుల రాజు సింహద్వారం, బలిపీఠాలను గ్రామ ప్రజలు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి పలువురు తమవంతు సహకారం అందించారు. వల్లూరు వాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎన్. శ్రీనివాసులు ఆలయ అవసరాల కోసం బీరువాతో పాటు 50 పూల మొక్కలను అందజేశారు. ఎన్. శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యాబోధనతో పాటు సమాజానికి, దేవాలయాలకు, గ్రామ అభివృద్ధికి తనవంతు సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు ఉపాధ్యాయుడు శ్రీనివాసుల సేవాభావాన్ని అభినందించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర బీమా పరిహారం

**- ఇ-డార్ నమోదులో జాప్యం వద్దు: అదనపు ఎస్పీ**



**మదనపల్లె, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**రోడ్డు ప్రమాద బాధితులకు త్వరితగతిన బీమా పరిహారం అందేలా ‘ఇ-డార్’పోర్టల్‌లో ప్రమాద వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా నమోదు చేయాలని అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం మదనపల్లె డీపీఓలో కంప్యూటర్ ఆపరేటర్లకు ఇ-డార్ నమోదుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే వాహనం, బాధితులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా పరిహారం ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి. రమేష్‌బాబు, ఎన్ఐసీ ప్రతినిధి ఎస్.ఖలీల్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫయాజ్ ఖాన్ తల్లిని పరామర్శించిన నిసార్ అహ్మద్



**మదనపల్లె, ఆగస్టు19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీలో వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ఫయాజ్ ఖాన్ తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ బుధవారం ఆమె స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నిసార్ అహ్మద్ వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ?

**- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బాలిరెడ్డి**



**వాల్మీకిపురం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఆ హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి డిమాండ్ వాల్మీకిపు రంలో డిమాండ్ చేశారు. “హామీలు ఎక్కడ? పీలేరు నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడ?” నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో వాల్మీకి పురం పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన హామీలలో ఎన్ని అమలు చేశారు? పీలేరు నియోజకవర్గానికి కొత్తగా తీసుకొచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి? ఎన్ని కొత్త ఉద్యోగాలు కల్పించారు? రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని బాలిరెడ్డి డిమాండ్ చేశారు. పీలేరు నియోజకవర్గంలో రోడ్లు, సాగునీరు, తాగునీరు, వైద్యం, విద్య, యువతకు ఉపాధి, రైతుల సమస్యలు తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కిసాన్ రాష్ట్ర అధ్యక్షుడు సింగం రామకృష్ణ రెడ్డి, కలికిరి మండల అధ్యక్షుడు షేక్ సయ్యద్ భాష, మైనారిటీ ఉపాధ్యక్షుడు ఎస్.కె. భాష, మల్లిక, మంగునాయక్, ఆదినారాయణ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ‘ఆదిత్య’లో ఘనంగా ఓరియంటేషన్

**- నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: డైరెక్టర్**




**మదనపల్లె, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కళాశాల విద్యా విధానాలు, అకడమిక్ నియమావళి, ఇంజినీరింగ్ విద్య ప్రాధాన్యత, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా. ఎస్. రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య కేవలం డిగ్రీ సాధించేందుకు మాత్రమే పరిమితం కాకుండా జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే తమ లక్ష్యాలను నిర్దేశించుకుని సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎం. నాగమల్లారెడ్డి పాల్గొని కళాశాల న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించారు. నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన వారు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర అభ్యాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా. పి. రాయుడు కళాశాల ప్రగతి, విద్యా కార్యకలాపాలు, విద్యార్థులకు అందిస్తున్న వివిధ అవకాశాలను వివరించారు. డీన్ అకడమిక్స్ డా. వి.వి.ఎన్. భాస్కర్ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసంపై దృష్టి పెట్టాలని తెలిపారు. డా. పి. సలీమా న్యూస్‌లెటర్ ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇది వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. డా. టి. అమరనాథ రెడ్డి అకడమిక్ రెగ్యులేషన్స్, క్రెడిట్లు, హాజరు, పరీక్షా విధానం, అంతర్గత మూల్యాంకనం, సెమిస్టర్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.ఆర్. సితార, ఎన్. అజిత, కే. ఈశ్వర్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. టీటీడీకి రూ.15 లక్షలు విరాళం తిరుమల: హైదరాబాద్ కు చెందిన డాక్టర్ పి.శిల్పా, డాక్టర్ శ్రీధర్ రెడ్డి దంపతులు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు బుధవారం రూ.15 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు తిరుమలలోని అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

# 34 శాతం రిజర్వేషన్లతో బీసీలకు రాజకీయ భరోసా!



**మదనపల్లె, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముసలికుంట నాగయ్య అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్లతో గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు బీసీల రాజకీయ ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని తెలిపారు.బీసీలకు కేటాయించిన నామినేటెడ్ పదవులను త్వరితగతిన భర్తీ చేయాలని కోరారు.బీసీ రిజర్వేషన్‌కు కృషి చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి సవిత, ఎమ్మెల్యే షాజహాన్ బాషాలకు నాగయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిసి నాయకులు ముదిమడుగు రామ్మూర్తి, కలిచర్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా సారాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**కలకడ, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలీస్ స్టేషన్ పరిధిలోని కోన గ్రామ పంచాయతీ, తిప్పిగారిపల్లి--గంగిరెడ్డిగారిపల్లి గ్రామాల మధ్య ఉన్న మట్టి రహదారి సమీపంలోని కొండ ప్రాంతంలో అక్రమంగా సారాయి తయారు చేసి తరలిస్తున్న వ్యక్తిని కలకడ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు బుధవారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో తిప్పిగారిపల్లి గ్రామంకు చెందిన షేక్ సుహేల్‌ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల సారాయి, కే.టి.ఎం మోటార్ సైకిల్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం వాయల్పాడు కోర్టుకు తరలించారు. అక్రమంగా సారాయి తయారీ, రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# బార్ నిర్వహణపై ఎక్సైజ్ అధికారులు పరిశీలన

**- నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని బీవైఎస్ డిమాండ్**



**మదనపల్లె, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో కొనసాగుతున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం పరిశీలన చేపట్టారు. బహుజన యువసేన (బీవైఎస్)తో పాటు అనిల్‌కుమార్, తేజ వేర్వేరుగా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి కొలతలు చేపట్టినట్లు బీవైఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. తమకు అందిన సమాచారం మేరకు సమీపంలోని ఆసుపత్రి నుంచి బార్‌కు సుమారు 72 మీటర్ల దూరం ఉన్నట్లు కొలతల్లో తేలిందని వారు తెలిపారు. అయితే బార్ నిర్వహణకు వర్తించే నిబంధనలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీవైఎస్ కోరింది. అదేవిధంగా పట్టణంలోని ఇతర బార్‌ల నిర్వహణపైనా నిబంధనల మేరకు తనిఖీలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని బీవైఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



## అన్నమయ్య జిల్లా

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**- కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**జిల్లాలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మదనపల్లె కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పాల్గొన్నారు. జిల్లాలోని 411 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని, పోలింగ్ కమ్యూనికేషన్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తున్నామని, ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కోర్టు కేసులతో ప్రభావితమైన పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి అవసరమైన సన్నాహక పనులు పూర్తయ్యాయని, తదుపరి కోర్టు తీర్పు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇతర జిల్లాల నుంచి సమకూర్చుకునేందుకు చర్యలు చేపడుతున్నామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను నిబంధనల మేరకు అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, ఎస్జీఎస్డబ్ల్యూ జిల్లా అధికారి అమర్నాథ్ రెడ్డి, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల, రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, పుంగనూరు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34% రిజర్వేషన్లు

**చంద్రబాబు హామీని నిలబెట్టుకున్నారు: పురం రామమూర్తి హర్షం**



**పీలేరు, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి అన్నారు. పట్టణ మార్కెట్ యార్డ్ ఆవరణలో బుధవారం బీసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అసెంబ్లీలో 34% రిజర్వేషన్ల బిల్లు ప్రకటించడం చారిత్రాత్మకమని కొనియాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీలకు సామాజిక న్యాయం చేకూర్చే దిశగా అడుగని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత చంద్రబాబు, పవన్, లోకేష్ లకే దక్కుతుందని, ఇది రాబోయే తరాలకు ఆదర్శమని పురం రామమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బీసీ నాయకులు పుల్లయ్య, టిడిపి పీలేరు నియోజకవర్గ బీసీ అధ్యక్షులు వసంతల రాజా, పీలేరు మండల మహిళా అధ్యక్షురాలు పురం రెడ్డమ్మ, హితేష్ రమాదేవి వనజ, లక్ష్మీకాంతమ్మ, నాయకులు అప్ప స్వామి, మొహమ్మద్ పీర్, బాబు, మార్కెట్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, రెడ్డి ముని, క్రాంతి, ఖాదర్ హుస్సేన్ భాస్కర శ్రీనివాసులు, ప్రముఖ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్ద ప్యాకింగ్ పేరుతో రూ.1.58 కోట్ల వసూళ్లు

**- ప్రధాన నిందితుడి అరెస్ట్.. ప్యాకింగ్ మెషిన్, ఒప్పంద పత్రాలు స్వాధీనం**



**మదనపల్లె,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటి వద్ద స్క్రబ్స్ ప్యాకింగ్ చేస్తే నెలకు వేలాది రూపాయలు సంపాదించవచ్చంటూ నమ్మించి ప్రజల నుంచి రూ.1.58 కోట్లకుపైగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ప్రధాన నిందితుడిని మదనపల్లె టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పూడిపర్తికి చెందిన తిరుమలకొండ రమేష్ (41) ‘స్క్రబ్స్ ఎంటర్‌ప్రైజెస్’ పేరుతో మురళీకృష్ణ తదితరులతో కలిసి ఈ వ్యవహారం నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇంటి వద్ద స్క్రబ్స్ ప్యాకింగ్ చేయడానికి ప్యాకింగ్ మెషిన్ కోసం రూ.30 వేలు, సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.లక్ష చొప్పున తీసుకుని, ప్యాకింగ్ మెటీరియల్ అందజేసి తయారు చేసిన ఉత్పత్తులను తిరిగి తీసుకుంటామని నమ్మించినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె బ్రాంచ్‌లో సుమారు 90 మంది నుంచి రూ.1.08 కోట్లకు పైగా, తిరుపతి బ్రాంచ్‌లో దాదాపు 80 మంది నుంచి రూ.50 లక్షలు వసూలైనట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. బుధవారం మదనపల్లె-పుంగనూరు రోడ్డులోని మున్సిపల్ ఆర్చ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు, అతడి సమాచారంతో సంస్థ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు ఫోన్‌పే స్కానర్లు, రెండు బిల్‌బుక్స్, ప్యాకింగ్ మెషిన్, ఇన్వాయిస్ పత్రాలు, ప్యాకింగ్ మెటీరియల్, డిపాజిట్ అగ్రిమెంట్లు, మూడు సెల్‌ఫోన్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సంస్థ నిర్వహణ, బ్యాంకు లావాదేవీలు, ఇతరుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

# విమర్శలేనా.. అభివృద్ధి కనిపించదా?



**రామసముద్రం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎమ్మెల్యే షాజహాన్ భాషపై సీపీఐ నాయకుడు మురళి చేసిన విమర్శలకు మండల టీడీపీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసే ముందు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను గమనించాలని హితవు పలికారు. మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవాలను విస్మరించి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని, లేనిపక్షంలో నిరాధార వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిన్నస్వామి, మాల మహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, నడింపల్లి రమేష్, పాలబత్తుల శ్రీనివాసులు, బాలాజీ, మైనారిటీ నాయకులు వహీద్, పెట్రోల్ బంకు నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

# ఏపి ఓమ్నిబస్ బిల్లుకు శాసనసభ ఆమోదం

## -సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి, ఆగస్టు19 (ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్(స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రకటించారు. బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్దరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం-2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం-2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడు తుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో నటి నిధి అగర్వాల్‌కు ఇడి ప్రశ్నలు

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్‌కు సంబంధించిన కేసులో సినీ నటి నిధి అగర్వాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఆమె ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమోషనల్ కార్యక్రమాలకు సంబంధించి కుదుర్చుకున్న కాంట్రాక్టులు, వాటి కాలపరిమితి, ప్రచారం కోసం అందించిన కంటెంట్, సోషల్ మీడియా లేదా ఇతర వేదికల ద్వారా నిర్వహించిన ప్రమోషన్స్‌పై కూడా ఈడీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఇక బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసినందుకు నిధి అగర్వాల్‌కు అందిన రెమ్యునరేషన్‌పై కూడా ఈడీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. ఒక్కో ప్రమోషన్‌కు ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు, ఆ మొత్తాలు ఏ విధంగా చెల్లించబడ్డాయి, ఎవరి నుంచి చెల్లింపులు వచ్చాయి వంటి అంశాలపై అధికారులు వివరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు లేదా వారికి సంబంధించిన వ్యక్తులు నిధి అగర్వాల్ బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసిన డబ్బు లావాదేవీలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆ చెల్లింపులు ప్రమోషనల్ కాంట్రాక్టులకు సంబంధించినవేనా, వాటికి సంబంధించిన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ జరిగినట్లు తెలుస్తోంది.

# ప్రిన్సిపల్ హత్యకేసులో విద్యార్థులే హంతకులు

**నల్గొండ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపారెడ్డి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆమె నిర్వహిస్తున్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులే రూపారెడ్డిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. డబ్బుల కోసమే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనలో విద్యార్థుల పాత్ర బయటకు రావడంతో తోటి విద్యార్థులు, టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతారని అనుకోలేదని అంటున్నారు. ఈ నెల 11న కొండమల్లేపల్లి మండలంలోని వేర్వేరు తండాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్క్, హుడీ ధరించి రూపారెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఒక విద్యార్థి ఇంట్లోకి వెళ్లి డబ్బులు ఇవ్వాలని బెదిరించగా.. ఆమె ప్రతిఘటించారు. మాస్క్ ఊడిపోవడంతో విద్యార్థిని గుర్తించి కేకలు వేశారు. గుర్తింపు బయటపడటంతో వెంట తీసుకెళ్లిన కత్తితో రూపారెడ్డిని పొడిచి హత్య చేశాడు. అనంతరం ఇంట్లో ఉన్న రూ.2.20 లక్షలు తీసుకుని బయట ఉన్న మరో విద్యార్థికి రూ.40 వేలు ఇచ్చాడు. ఇద్దరు విద్యార్థులు చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడినట్లు దర్యాప్తులో తేలింది. విచారణ సమయంలో విద్యార్థి జేబులో ఉన్న రూ.1.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు రక్తపు మరక ఉండటాన్ని గుర్తించారు. రక్తపు మరకలపై ప్రశ్నించడంతో విద్యార్థులు నిజం అంగీకరించారు.

# మహాబలిపురంలో దక్షిణాది రాష్ట్రాల సిఎంల భేటీ

## అమిత్ అధ్యక్షతన భేటీకి సిఎం చంద్రబాబు హాజరు

**చెన్నై,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం దక్షిణ ప్రాంతీయ మండలి 31వ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ముఖ్యమంత్రులు హాజరవుతారు. ఈ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఏపీ ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలను ఆయన ప్రస్తావించనున్నారు. ఈ క్రమంలో ఏపీ పునర్విభజన చట్టం అమలుపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్రం చొరవ తీసుకోవాలని కోరనున్నారు. షెడ్యూల్ 9,10 సంస్థల విభజనపై కేంద్రం దృష్టికి ఆయన తీసుకెళ్లనున్నారు. ఆస్తులు, అప్పుల పంపకం, పెండింగ్‌లోని ఆర్థిక అంశాల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. అలాగే రెవెన్యూ గ్యాప్, పన్ను సంబంధిత అంశాలను కూడా ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. దుగరాజుపట్నం పోర్టు అంశాన్ని కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్రాన్ని ఆయన కోరనున్నారు. రైల్వే కనెక్టివిటీ, విమానాశ్రయాల అభివృద్ధిపై చర్చించనున్నారు. పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర సహకారం ఆయన కోరనున్నారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అంశాన్ని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అందిస్తున్న సహకారానికిగాను కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలపనున్నారు. మిగిలిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయడంతోపాటు నిధులు సమకూర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నారు.

# స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు

## -మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**అమరావతి, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్‌లు హౌస్ హోల్డింగ్ మ్యాప్ అంశంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారు. ఒక జిల్లాలో ఉన్న వ్యక్తిని తీసుకెళ్లి మరో జిల్లాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో చేర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యలు పరిష్కరిస్తున్నాం, రేషన్ కార్డుల్లో మార్పులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్‌ల్లో మార్పులు, చేర్పులపై ప్రజల నుంచి వచ్చిన 2 లక్షల 16 వేల వినతులు పరిష్కరించాం. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆయా డిపార్ట్మెంటులు ప్రతిపాదనలు పంపాయి. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి ప్రమోషన్లు కల్పిస్తామని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# ఎల్-నినో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## వ్యవసాయ, అనుబంధ శాఖలపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష



**అనంతపురం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో ప్రైమరీ సెక్టార్ పై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్-నినో పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే 68 శాతంపైగా పూర్తి కాగా, పూర్తిగా చేపట్టాలన్నారు. జిల్లాలో 502 గ్రామాల పరిధిలో 48,900 ఎకరాల్లో హాఫ్ మూన్ మోడల్ లో పంటల సాగు చేయాల్సి ఉండగా, ఇందులో పురోగతి తక్కువగా ఉందని, మరింత పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీలో (ఏపీఎఫ్ఆర్)లో రైతుల రిజిస్ట్రేషన్ మరింత చేపట్టాలన్నారు. హార్టికల్చర్ పంటల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ వచ్చే నెల 15వ తేదీలోపు పూర్తిగా చేపట్టాలని ఆదేశించారు. పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి డిసిఓ పరిధిలో పిఏసిఎస్ లో ఒకటి పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టాలని, ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కెసిసి కార్డులు ఉన్న మత్స్యకారులకు బ్యాంకులలో రుణాలు ఇవ్వడం లేదని, రుణాలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంకి సూచించారు. ఇందులోభాగంగా ఈ ఖరీఫ్ లో మైనస్ 36 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడం జరిగిందని, జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3,43,394 హెక్టార్లకు గాను, 1,87,598 హెక్టార్లలో అనగా 55 శాతం మాత్రమే పంటల సాగు చేయడం జరిగిందని, వేరుశెనగ 30 శాతం మాత్రమే సాగు కాగా, కంది 116 శాతం సాగు కావడం జరిగిందని, ఎల్-నినో పరిస్థితుల వల్ల ఐడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, ఎపిఎంఐపి, పశుసంవర్ధక శాఖ, మార్క్ఫెడ్, మార్కెటింగ్, డ్వామా, తదితర శాఖల పరిధిలో ఆయా కార్యక్రమాల ప్రగతి గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం డా.నవీన్, కెవికె శాస్త్రవేత్త మల్లీశ్వరి, జిల్లా సెరికల్చర్ అధికారి మెహతాజి సుల్తాన్, జిల్లా ఫిషరీస్ అధికారి విజయకృష్ణ, మార్కెటింగ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 9 జిల్లాల కీలక డేటా సెట్లపై నివేదిక సేకరణ

## తిరుపతి ఎకనామిక్ రీజియన్ సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ నందు తిరుపతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై విజయవాడ నుంచి వచ్చిన కన్సల్టెంట్ ప్రత్యూష్ పోద్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, నీటిపారుదల శాఖ, మైనింగ్, టూరిజం, భూగర్భ జల శాఖల ప్రగతి, అవకాశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పరిధిలోని 9 జిల్లాలకు సంబంధించిన కీలక డేటా సెట్లను సమీక్షించి, పూర్తి స్థాయి నివేదిక (రైట్-అప్) తయారీకి కావలసిన ఇన్పుట్లు, సూచనలను సంబంధిత అధికారుల నుండి సేకరించారు. జిల్లాలోని ధర్మవరం, సోమందేపల్లి తదితర ప్రాంతాలకు చెందిన చేనేత, టెక్స్టైల్స్ రంగానికి సంబంధించిన సమగ్ర వివరాలను కన్సల్టెన్సీ బృందానికి అందించారు. వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖల ద్వారా జిల్లా స్థూల జిల్లా అంతర్గత ఉత్పత్తి పెంపునకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు ఎన్జీవోలు, ఎఫ్‌పీవోలు, స్వయం సహాయక సంఘాల సలహాలు, సూచనలను కూడా ఈ సమీక్షలో పరిగణనలోకి తీసుకున్నారు. సమావేశంలో సిపిఓ విజయ్ కుమార్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికలను వ్యభిచార రొంపిలోకి దింపడంపై శిక్ష

## ముగ్గురికి 14 ఏళ్ల జైలు...14 మందికి పదేళ్ల కారాగారం

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** నాంపల్లి పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మైనర్లను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ముఠాకు చెందిన 33 మందిని దోషులుగా నిర్ధారించి, శిక్షలను ఖరారు చేసింది. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో నాంపల్లి పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది బాలికలను ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికలను ప్రలోభాలకు గురిచేసి, వ్యభిచారంలోకి దించినట్లు తేలింది. ప్రాసిక్యూషన్ ఆరోపణలను కోర్టు విచారణలో పరిశీలించింది. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం దోషులకు శిక్షలు విధించింది. తీర్పులో భాగంగా ఐదుగురు దోషులకు జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు కూడా కేసులో వారి పాత్రను బట్టి న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడిన ముఠాపై కఠినంగా వ్యవహరించిన నాంపల్లి పోక్సో కోర్టు తీర్పు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# యువతకు ఉద్యోగాలు కల్పించాలి

## అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్

**ఏలూరు, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** అఖిల భారత యువజన సమాఖ్య అధ్యర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ విధానాల కారణంగా యువత నిరుద్యోగం, ఉపాధి, వలసలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏలూరు జిల్లా కన్వీనర్ రాజు ఆందోళన వ్యక్తం చేసారు. ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, మరోవైపు ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పోటీ పరీక్షల్లో జాప్యం, పేపర్ లీకులు, పరీక్షల రద్దు, నియామక ప్రక్రియలో అవకతవకల వల్ల నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన జాబ్ క్యాలెండర్, 4 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, కొత్త పరిశ్రమల ఏర్పాటు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. మరోనేత కురెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, ఎంఎస్ఎంఇ రంగాన్ని బలోపేతం చేసి స్థానిక యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాలనీ, పేపర్ లీకులు, పరీక్షల అవకతవకలను అరికట్టి నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, యువతకు ఉపాధి హక్కుకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేసారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఐవైఎఫ్ మాజి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ తదితరులు మాట్లాడగా, కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య యువజన సమాఖ్య మాజీ నాయకులు భజంత్రి శ్రీనివాస్, నాగం అచ్చుత్, కొండేటి విక్రమ్,నవీన్, బి గిరి, సాయి, బ సురేష్, సిద్దు పాల్గొన్నారు

# తప్పిన పెను ప్రమాదం

**ఏలూరు, ఆగస్టు 19 (ఆర్ఎన్ఏ):** ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సమీపంలో బుధవారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. విజయవాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోగా, అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను మరో ఆర్టీసీ బస్సులో తరలించాడు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం వైపు పంపించిన డ్రైవర్, వాహనం రిపేర్ కోసం బస్సును రోడ్డు మార్జిన్ వైపు నిలపగా, అదే సమయంలో బస్సును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ప్రమాదపు అంచుల్లోకి వెళ్లిన ఆర్టీసీ బస్సు ప్రయాణీకులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు హైవే పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు బస్సును ఢీకొట్టి తప్పించుకుపోయిన కంటైనర్‌ను స్వాధీనపర్చుకుని. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు పోలీసులు.

# గల్లంతయిన మత్స్యకారుల కోసం ముమ్మర గాలింపు

## అధికారులదో ఆరా తీసిన సిఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు ఎప్పటికప్పుడు గాలింపు చర్యలకు సంబంధించిన వివరాలు తెలియచేస్తూ ఉండాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన కోనసీమ జిల్లాలోని మత్స్యకారుల గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు బుధవారం ఆరా తీశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతోపాటు ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్‌గా సమావేశమయ్యారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీని కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా వారిని ఆదేశించారు. గాలింపు చర్యలు ఏ మేరకు జరుగుతున్నాయని వారిని సీఎం అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్స్, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారని సీఎంకు వారు వివరించారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఇప్పటికే రెండు డార్నియర్ విమానాలు, నేవీ బోట్లతో పాటు మరో ఏడు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. పారాదీప్‌కు 14 నాటికల్ మైళ్ల దూరంలో కొన్ని పడవలను గుర్తించామని.. వాటి గురించి ఆరా తీస్తున్నామని చెప్పారు.

# కోల్‌కతా ప్రమాదంలో 9 మంది మృత్యువాత

## మృతులంతా చికిత్స కోసం వచ్చిన బంగ్లాదేశీయులుగా గుర్తింపు



**కోల్‌కతా,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని మిర్జా గాలిబ్ వీధిలో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 9 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. రాత్రి 1.45 నిమిషాలకు ప్రమాదం చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. గాయపడ్డవారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. దట్టమైన పొగ కమ్ముకోవడం వల్లపై అంతస్తులకు చేరుకోవడానికి అగ్నిమాపక సిబ్బంది ఇబ్బందిపడింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో ఓ చిన్నారి సహా 9 మంది మృతి చెందారు. న్యూమార్కెట్ ప్రాంతంలోని ఫ్రీ స్కూల్ వీధిలో అర్ధరాత్రి 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పలువురు చిక్కుకుపోయి మరణించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారందరూ బంగ్లాదేశీయులేనని అగ్నిమాపక శాఖ తెలిపింది. మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వారు కోల్‌కతాకు వచ్చారని అధికారులు తెలిపారు. ఏసీ పేలడంతో మూడో అంతస్తులో మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఘటనకు గల కారణం ఇంకా వెల్లడించలేదు. మంటలు చెలరేగగానే హోటల్‌లోని కొందరు బయటకు పరుగుతీశారు. అగ్నికీలలు చుట్టూ ఉన్న ఇళ్లవైపు వ్యాపించడంతో ప్రజలు హాహాకారాలు చేశారు. ఘటన గురించి తెలియగానే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగు ఫైర్ ఇంజన్ల సాయంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చారు. దట్టమైన పొగ వ్యాపించడంతో సహాయ కార్యక్రమాలకు కాస్త అంతరాయం ఏర్పడిందని ఓ పోలీసు అధికారి తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం బిర్భూమ్ జిల్లాలోని ఓ హోటల్ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా పలువురు గాయపడ్డారు.

# డ్రగ్స్ రాకెట్ ముఠా గుట్టురట్టు

## ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

**హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలని డీసీపీ సూచించారు.

# పుణె జిల్లాలో దారుణ ఘటన

## -బాలికపై అత్యాచార యత్నం...హత్య -యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**పుణె,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** మహారాష్ట్రలోని పుణె జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 9 ఏళ్ల బాలికపై పొరిగింటి వ్యక్తి అత్యాచారం చేసి హత్యకు పాల్పడ్డాడు. ఆ పొరుగింటి 25 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు పుణె-నాసిక్ జాతీయ రహదారిని దిగ్బంధించారు పుణె జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాధిత బాలిక నాలుగో తరగతి చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. మంగళవారం అనారోగ్యంగా ఉండటంతో బాలిక పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. మధ్యాహ్న సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో లేని విషయాన్ని తెలుసుకున్న నిందితుడు బాలికను లైంగికంగా వేధించాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేశాడు బాలిక ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కలిసి పరిసర ప్రాంతాల్లో గాలించారు. గంటల పాటు వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆ బాలిక కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి నిందితుడు కూడా వెతికాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి కనిపించాడు. వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అతడు నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఓ వాగు సమీపంలోని చెట్టు కింద బాలిక మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఘటనాస్థలాన్ని ఫోరెన్సిక్ బృందం పరిశీలించి కీలక ఆధారాలను సేకరించింది. నిందితుడికి మరణశిక్ష విధించాలని, కేసును త్వరితగతిన విచారించాలని బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

# టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

## -వాటిని అప్పడే తెరిచేలా చేయకండి

## -తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ):** ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే సీఎం విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

# 'మల్లెపూల పల్లకి' విమర్శలపై దర్శకుడేమన్నాడంటే?



అయ్యప్ప స్వామి భక్తులు పాడుకునే పాటల్లో 'మల్లెపూల పల్లకి'కి ఉన్న ఆదరణే వేరు. అయ్యప్ప మాల సీజన్ మొదలైందంటే ఈ పాట ఊర్లలో మార్మోగిపోతుంటుంది. మాస్ రాజా రవితేజను అయ్యప్ప భక్తుడిగా చూపిస్తూ 'ఇరుముడి' అనే సినిమా తీసిన మేకర్స్.. ఈ సినిమాలోనూ 'మల్లెపూల పల్లకి' పెడుతున్నారన్న వార్త బయటికి రావడంతో ఈ సాంగ్‌కు ముందే మంచి హైప్ వచ్చింది. పాట ఒక రేంజిలో ఉంటుందని ఊహించుకున్నారు. కానీ తీరా చూస్తే ఈ పాటను రిలీజ్ చేసినపుడు మిక్స్డ్ రెస్పాన్స్ వచ్చింది. ఒరిజినల్ సాంగ్‌ను యథాతథంగా కంపోజ్ చేసి ఉన్నా అదిరిపోయేదని.. జి.వి.ప్రకాష్ కుమార్ లాంటి టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఒరిజినల్ ట్యూన్‌కు సరితూగేలా సాంగ్ కంపోజ్ చేయలేదని, ఒరిజినల్ సింగర్ దప్పు శ్రీనుతోనే ఈ పాట పాడించినా అసలు పాటను మ్యాచ్ చేయలేకపోయారని విమర్శలు వచ్చాయి. సినిమాలో ఈ పాట డీజే వెర్షన్ ఉంటుందని, అది పెద్ద సర్ప్రైజ్ అని మేకర్స్ అంటున్నప్పటికీ.. జనాల్లో అంచనాలు పెరగట్లేదు. 'మల్లెపూల పల్లకి' సాంగ్ మీద వస్తున్న విమర్శలపై దర్శకుడు శివ నిర్వాణ తాజాగా స్పందించాడు. ఒరిజినల్ సాంగ్‌లో ఉన్న బేస్ వాయిస్‌కు 'ఇరుముడి'లో ఉన్న వాయిస్ సరితూగలేదన్న అభిప్రాయాన్ని శివ నిర్వాణ అంగీకరించాడు. అసలు పాటను పాడిన దప్పు శ్రీనుతోనే పాడించినా.. ఈ తేడా ఎందుకు వచ్చిందో అతను వివరించే ప్రయత్నం చేశాడు. ఒరిజినల్ సాంగ్‌ను దప్పు శ్రీను 15 ఏళ్ల కిందట పాడాడని.. ఇప్పుడు ఆయన వయసు పెరిగిందని, స్వరం మారిందని.. అందుకే ఒకప్పట్లా బేస్ వాయిస్ లేకపోవచ్చని అతనన్నాడు. ఒరిజినల్ సింగర్‌తో పాడించి గౌరవించాలన్న ఉద్దేశంతోనే దప్పు శ్రీనుతో ఈ పాట పాడించామని శివ తెలిపాడు. మరోవైపు అయ్యప్పస్వామి మాల నేపథ్యంలోనే సాగే మలయాళ చిత్రం 'మాలికాపురం'తో 'ఇరుముడి'కి వస్తున్న పోలికల గురించి కూడా శివ నిర్వాణ స్పందించాడు. రెంటినీ పోల్చడంలో ఆశ్చర్యం లేదని.. కానీ తన సినిమాలో ఏం కంటెంట్ ఉందో తనకు తెలుసు కాబట్టి తాను ఎప్పుడూ ఈ పోలికల గురించి కంగారుపడలేదని... తన సినిమా యునీక్‌గా ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రేక్షకులు కూడా అంగీకరిస్తారని అతను ధీమా వ్యక్తం చేశాడు.




## టాక్సిక్ కొంచెం జాగ్రత్త పడాల్సిందే



నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ టాక్సిక్ తెలుగు డబ్బింగ్ వెర్షన్ కి టికెట్ రేట్ల పెంపు తీసుకుంటారనే టాక్ బయటికి రావడం ఆలస్యం సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. గతంలో కూలి, కాంతార లాంటి వాటికి కూడా హైక్స్ ఇచ్చారు కానీ ఈసారి పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. ఏ మాత్రం తొందరపడినా దాని తాలూకు పరిణామాలు నేరుగా ఓపెనింగ్స్ మీద పడేలా ఉన్నాయి. టాక్సిక్ ఈ విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే పెద్ది తర్వాత అంటే జూన్ మూడో వారం నుంచి ఇప్పటిదాకా తెలుగు ప్రేక్షకులు ఎలాంటి టికెట్ రేట్ల పెంపు లేకుండా బోలెడు సినిమాలు చూశారు. మా ఇంటి బంగారం, లెనిన్, చెన్నై లవ్ స్టోరీ, విశ్వనాథ్ అండ్ సన్స్, ఒడిస్సి,. స్పైడర్ మ్యాన్ బ్రాండ్ న్యూ డే మొదలైనవన్నీ విజయవంతంగా మాములు ధరలకే నిర్మాతలకు కనకవర్షం కురిపించాయి. ఆడియన్స్ కూడా ఇదేదో బాగుందని వాటికి బాగా అలవాటు పడ్డారు. ఇరుముడికి కూడా పెంపు అడగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో హఠాత్తుగా టాక్సిక్ కనక పెంపు తీసుకుంటే రిస్క్ అవుతుంది. ఎందుకంటే ఇది తెలుగు సినిమా కాదు. తెలుగు వాళ్ళు తీయలేదు. తెలుగు హీరో నటించలేదు. టెక్నీషియన్స్ ఎవరూ తెలుగు వాళ్ళు కాదు. అంతెందుకు టాలీవుడ్ యాక్టర్స్ ఎవరున్నారు అంటే ఠక్కున సమాధానం దొరకదు. అలాంటప్పుడు స్పెషల్ ట్రీట్ మెంట్ ఎందుకు ఇవ్వాలనేది మూవీ లవర్స్ ప్రశ్న. జీఓ వస్తుందనే ప్రచారం నేపథ్యంలో ఇంత చర్చ జరుగుతోంది. ఈ విషయం గురించే కాదు టాక్సిక్ లో బోల్డ్ కంటెంట్ మీద కూడా జనాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హీరో యష్ అంత ఏముందవని, నేను ఎవరినీ ముద్దు కూడా పెట్టుకోలేదని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. కానీ కియారా అద్వానీ, తారా సుతారియా పాటల్లో చూస్తేనేమో ఫుల్లుగా రొమాన్స్ ఉంది. ఇక్కడ లింక్ మిస్ అవుతోంది. ఏది ఏమైనా టికెట్ రేట్ల హైక్ తీసుకున్నా తీసుకోకపోయినా టాక్సిక్ మటుకు యునానిమస్ టాక్ తెచ్చుకుంటేనే మనదగ్గర వర్కౌట్ చేసుకోగలదు.

# రజిని సినిమాలో విలన్... రాపో పెద్ద రిస్కు?



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ధర్మన్ షూటింగ్ మంచి ఊపు మీద ఉంది. ఇప్పటికే పలు వాయిదాలు, డైరెక్టర్ల మార్పుతో బాగా లేట్ అయిన ఈ ప్రాజెక్టుని వచ్చే సంక్రాంతి బరిలో దింపాలనే సంకల్పంతో నిర్మాత కమల్ హాసన్ తన టీమ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటికే ఒక షెడ్యూల్ అయిపోగా రజని బ్రేక్స్ ఇవ్వకుండా నిత్యం అందుబాటులో ఉంటున్నారు. తాజాగా ఒక అప్డేట్ టాలీవుడ్ జనాలకు షాక్ కలిగించేలా ఉంది. చెన్నై సమాచారం మేరకు ధర్మన్ లో నెగటివ్ షేడ్స్ ఉన్న ఒక ముఖ్యమైన పాత్రకు రాపో రామ్ పోతినేని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అధికారికంగా ప్రకటించలేదు కానీ దాదాపు ఓకే అయినట్టు వినికిడి. రజని కూతురిగా నటిస్తున్న శ్రీలీలకు జోడిగా రామ్ ఉంటాడని, చాలా పవర్ ఫుల్ ఎపిసోడ్స్ రజనితో పాటు ఉంటాయని అంతర్గత వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. అంత పెద్ద కోలీవుడ్ స్టార్ తో నటించడం రామ్ కు ఒక ప్రత్యేక జ్ఞాపకంగా నిలిచిపోతుంది కానీ ఒక రిస్క్ ఉంది. రజనీకాంత్ కూలిలో నాగార్జున ప్రతినాయకుడిగా చేయడం ఆయనకు పెద్ద మేలు కలిగించలేదు. కారణం ఆ పాత్రను డిజైన్ చేసిన తీరు. విక్రమ్ రోలెక్స్ రేంజ్ లో పేలుతుందనుకుంటే అతి మాములుగా వచ్చింది. దానికి తోడు కూలి ఫ్లాప్ కావడం నాగ్ కు ఉపయోగపడలేదు. అంతకు ముందు అజిత్ వలిమైలో టాలీవుడ్ యూత్ హీరో కార్తికేయ విలన్ గా చేయడం వల్ల ఎలాంటి బెనిఫిట్ దక్కలేదు. మరి రామ్ ఇవన్నీ ఆలోచించే ఒప్పుకన్నాడంటే ఏదో పవర్ ఫుల్ టచ్ ఉంటుంది. ఇంకా అఫీషియల్ గా చెప్పలేదు కానీ కన్ఫర్మేషన్ కోసమైతే ఇంకొద్ది రోజులు వేచి చూడాలి. స్వీయ దర్శకత్వంలో తన ఇరవై మూడో సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న రామ్ ఒకవేళ నిజంగా ధర్మన్ చేసే పనైతే డేట్స్ ఎలా అడ్జస్ట్ చేస్తారో చూడాలి. సెతస్కోప్ పట్టుకునే డాక్టర్ కత్తులు పట్టుకుని ఎందుకు రక్తపాతం సృష్టించాల్సి వచ్చిందనే పాయింట్ మీద ధర్మన్ రూపొందుతోంది. యాక్షన్,. వయొలెన్స్ ఈసారి పుష్కలంగా ఉంటాయట. దీనికన్నా ముందు జైలర్ 2 అక్టోబర్ రెండో వారంలో రిలీజ్ కానుంది.

## అభిమాని చిరకాల కోరిక తీర్చిన రామ్



సినీ హీరోల మీద ఫ్యాన్స్ వీరాభిమానానికి సంబందించి ఎన్నో ఉదంతాలు చూశాం. కానీ ఇది చాలా చిత్రమైన వ్యవహారం. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన శశిభవ్యత అనే అమ్మాయి లాఫోరా మయోక్లోనిక్ ఎపిలెప్సీ అనే అరుదైన జన్యు పరమైన వ్యాధితో బాధ పడుతోంది. తరచూ ఫిట్స్ రావడం, నాడీ వ్యవస్థ దెబ్బ తినడంతో మంచానికే పరిమితం అయిన 18 ఏళ్ల ఈ అమ్మాయికి టాలీవుడ్ యువ కథానాయకుడు రామ్ అంటే వల్లమాలిన అభిమానం. మతిస్థిమితం కూడా సరిగా లేని ఈ అమ్మాయికి రామ్ పేరు చెబితే.. ఒంట్లో ఉత్సాహం వస్తోంది. శశిభవ్యత తల్లిదండ్రులు.. ఆమెకు రామ్ వీడియోలు, ఫొటోలు చూపించి అన్నం తినిపించి మందులు వేస్తున్నారట. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత.. రామ్ దృష్టికి వచ్చింది. ఈ అభిమాని పరిస్థితి చూసి కదిలిపోయిన రామ్.. వెంటనే స్పందించాడు. ఆ బాలికతో రామ్ వీడియో కాల్ మాట్లాడాడు. ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. శశిభవ్యతకు అవసరమైన మందులు, ఇతర ఖర్చులు అన్నీ ఇకపై తానే భరిస్తానని రామ్ తెలిపాడు. ఆమె రిపోర్టులు అన్నీ కూడా తనకు అందాయని.. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతుగా ప్రయత్నిస్తానని రామ్ చెప్పాడు .



# బిజినెస్ న్యూస్



## ఏడో రోజూ నష్టాల్లో నిఫ్టీ.. 24,100 దిగువకు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, ఇతర మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు నష్టపోయాయి. దీంతో నిఫ్టీ వరుసగా ఏడో రోజూ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఓ దశలో 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 325.78 పాయింట్ల నష్టంతో 76,909.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 76.60 పాయింట్ల నష్టంతో 24,078 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, సన్‌ఫార్మా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91 డాలర్ల స్థాయికి చేరగా.. బంగారం ఔన్సు ధర 4,368 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## అదరగొట్టిన బెహరీలాల్ ఇంజినీరింగ్.. 63% ప్రీమియంతో లిస్టింగ్




ఐరన్ అండ్ స్టీల్ తయారీ కంపెనీ బెహరీలాల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ మదుపర్లకు లాభాల వర్షం కురిపించింది బుధవారం దాదాపు 63 శాతానికి పైగా ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.285 కాగా 60.70 శాతం లాభంతో బీఎస్ఈలో రూ.458 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలోనూ 63.15 శాతం ప్రీమియంతో రూ.465 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,135.22 కోట్లకు చేరింది. కంపెనీ ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ డిమాండ్ వచ్చింది. చివరి రోజు నాటికి 108.44 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రూ.302 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. ఒక్కో షేరు ధర రూ.271-285గా కంపెనీ నిర్ణయించింది.

35% ప్రీమియంతో షిప్ రాకెట్ అరంగేట్రం ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ షిప్‌రాకెట్ కూడా వాటాదారులకు మంచి లిస్టింగ్ లాభాలను అందించింది. 35 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.97గా కంపెనీ నిర్ణయించగా.. బుధవారం బీఎస్ఈలో 33.50 శాతం లాభంతో రూ.129.50 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఎన్ఎస్ఈలో 35 శాతం ప్రీమియంతో రూ.131 వద్ద ట్రేడింగ్ మొదలెట్టాయి. దీంతో కంపెనీ విలువ రూ.9,901.60 కోట్లకు చేరింది. ఈ కంపెనీ రూ.1617.5 కోట్లు నిధుల సమీకరణ లక్ష్యంతో ఆగస్టు 12న ఐపీఓకి వచ్చింది. 14న సబ్‌స్క్రిప్షన్ ముగిసింది. చివరి రోజు నాటికి 99.38 రెట్ల బిడ్డింగ్ నమోదు చేసింది. ధరల శ్రేణి రూ.92-97గా నిర్ణయించింది .

## టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. వందేళ్లలో తొలిసారి




మంగళవారం జరగాల్సిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వాయిదా పడింది. సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ), సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్(ఎస్‌డీటీటీ) తమ ప్రతినిధిని నామినేట్ చేయలేకపోవడంతో, ఏజీఎంకు కోరమ్ (కనీస సభ్యులు) లేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. వందేళ్లలో టాటా సన్స్ ఏజీఎం వాయిదా పడడం ఇదే తొలిసారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌లో ఈ రెండు ట్రస్టులకు 51% పైగా వాటా ఉంది. ఎందుకు ఇలా జరిగిందంటే: మహారాష్ట్ర ఛారిటీ కమిషన్ ఆదేశాల ప్రకారం, ఎటువంటి ప్రధాన నిర్ణయాలు తీసుకోవడం కానీ, సమావేశం నిర్వహించడం కానీ ఎస్ఆర్‌టీటీ చేపట్టరాదు. దీంతో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరగాల్సిన ఏజీఎంకు తన ప్రతినిధిని ఎస్ఆర్‌టీటీ నామినేట్ చేయలేకపోయింది. దీంతో కనీసం అయిదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన ఏజీఎంను వాయిదా వేయక తప్పలేదు. పరిశీలకులు ముందుగానే దీన్ని ఊహించినా, టాటా సన్స్ మాత్రం మంగళవారం వరకు నిర్ణయం తీసుకోలేదు.

## ఆర్‌బీఐ కొత్త రూల్.. హోమ్‌లోన్ EMIలు మారనున్నాయా?



హోమ్‌లోన్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రతిపాదనతో ముందుకొచ్చింది. గృహ రుణాల వడ్డీ రేట్ల రీసెట్‌కు సంబంధించి తాజాగా డ్రాఫ్ట్ ఫ్రేమ్‌వర్క్‌ను విడుదల చేసింది. దీనివల్ల ఇప్పటికప్పుడు రుణ గ్రహీతలపై ప్రభావం పడనప్పటికీ.. వచ్చే ఏడాది నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఇంతకీ ఏమిటీ నిబంధన? దీనివల్ల ఏమిటీ ప్రయోజనం? సాధారణంగా హోమ్‌లోన్‌లు ఫ్లోటింగ్ రేట్‌తో ముడిపడి ఉంటాయి. అంటే, ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను సవరించినప్పుడు దాన్ని అనుసరించి రుణ రేట్లు మారుతుంటాయి. అయితే, అన్ని బ్యాంకులూ ఒకేసారి మార్చవు. కొన్ని సందర్భాల్లో ఇవి మారడానికి ఏడాది సమయం పడుతోంది. దీనివల్ల తగ్గిన వడ్డీ ప్రయోజనం రుణ గ్రహీతలకు చేరడంలో ఆలస్యమవుతోంది.

**తీసుకొస్తున్న మార్పేంటి?**

ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల రీసెట్ సమయం మూడు నెలలకు మించకూడదని ఆర్‌బీఐ తన తాజా నిబంధనల్లో పొందుపరిచింది. అంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు వేగంగా ఆ ప్రయోజనం దక్కుతుంది. అదే సమయంలో వడ్డీ రేట్లు పెంచినప్పుడూ ఇదే నియమం వర్తిస్తుంది. దీనిపై సెప్టెంబర్ 11 వరకు అభిప్రాయాలను సేకరిస్తోంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.


**వ్యక్తిగత రుణాలకు వర్తిస్తుందా?**

ఆర్‌బీఐ తీసుకొస్తున్న నిబంధనలు కేవలం ఫ్లోటింగ్ రేట్ రుణాలకు మాత్రమే. గృహ రుణాలకు మాత్రమే ఈ వడ్డీ రేట్లు ఉంటాయి. వ్యక్తిగత, ఆటో రుణాలకు స్థిర వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. కాబట్టి ఆర్‌బీఐ తీసుకొస్తున్న ఈ మార్పు వల్ల వ్యక్తిగత రుణాలపై ప్రభావం ఉండదు. కాబట్టి ఈఎంఐలలో ఎలాంటి మార్పూ ఉండదు. కొత్తగా తీసుకొనే గృహ రుణ వినియోగదారులు, ఇప్పటికే హోమ్‌లోన్ తీసుకున్నవారికే ఈ నిబంధన వర్తించనుంది.

## ముక్కంటి ఆలయానికి రూ1.36 కోట్లు ఆదాయం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మ వార్లతో పాటు పరివార దేవతమూర్తుల హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో సమకూరింది. ఆలయ ఆవరణలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 19 రోజులకు రూ 1,36,83,425 ఆదాయం వచ్చిందని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బి కె వెంకటేశులు తెలిపారు. దీంతోపాటుగా బంగారం,11 గ్రాములు వెండి 406 కిలోల విదేశీ కరెన్సీ నోట్లు 77 వచ్చాయని వివరించారు.




## ఓజిలి, నాయుడుపేట మండలాల పరిధిలో ఏపీఐఐసీ భూసేకరణపై సమీక్ష



**తిరుపతి సిటీ, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలోని ఓజిలి, నాయుడుపేట మండలాలకు సరిహద్దుగా ఉన్న కుందం, కారూరు, మచ్చవరం, మనవాలి, కర్రబల్లవోలు, ఐపీ–అత్తివరం, ఐపీ–నాయుడుపేట, ఎమ్‌పిఎస్‌ఈజెడ్ గ్రామాలకు సంబంధించి రూపొందించిన ఉమ్మడి పటాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పరిశీలించారు. బుధవారం సాయంత్రం సూళ్లూరుపేట ఆర్డీఓ శ్రీ దేవేంద్ర రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ ఉమ్మడి గ్రామ పటం, గ్రామ సరిహద్దులు, పారిశ్రామిక సరిహద్దులు, ఏపీఐఐసీ ద్వారా భూసేకరణకు సంబంధించిన భూముల వివరాలను పరిశీలించారు. కుందం, కారూరు, మచ్చవరం, మనవాలి తదితర గ్రామాలకు సంబంధించి మ్యాప్‌లో చూపించిన భూ విస్తీర్ణం, గ్రామ సరిహద్దులు, పారిశ్రామిక ప్రాంతాల పరిధి, ఏపీఐఐసీ భూసేకరణకు సంబంధించిన వివరాలను అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ప్రత్యేకంగా ఐపీ–అత్తివరం, ఐపీ–నాయుడుపేట, ఎమ్‌పిఎస్‌ఈజెడ్ పరిధిలోని పారిశ్రామిక సరిహద్దులు, సంబంధిత గ్రామాల భూసరిహద్దులతో సమన్వయం చేసుకునే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులు, మ్యాప్‌లో చూపించిన వివరాలు పరస్పరం సరిపోలేలా పరిశీలించి, అవసరమైన చోట స్పష్టత తీసుకురావాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో గ్రామాల వారీగా భూముల విస్తీర్ణం, సరిహద్దులు, పారిశ్రామిక అవసరాల కోసం గుర్తించిన భూమి తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన చేసి, రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు, పారదర్శకంగా మరియు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో ఓజిలి తహసీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చెరగనిజ్ఞాపకం ఛాయాచిత్రం

### - ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు




**తిరుపతి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చరిత్రకు సాక్ష్యం ఛాయాచిత్రం. రెప్పపాటు కాలాన్ని కంటి ముందు నిలిపేది ఫోటో..ప్రతి మనిషి జీవితంలో ఛాయాచిత్రం అనేది ఓ చెరగని జ్ఞాపకమని తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యులు జి.భాను ప్రకాశ్ రెడ్డిలు అన్నారు.. బుధవారం ప్రెస్ క్లబ్‌లో తిరుపతి జిల్లా ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి విచ్చేశారు. కెమెరా సృష్టికర్తల చిత్రపటానికి నివాళులర్పించారు. తరువాత కేకును కట్ చేసి ఫోటో జర్నలిస్టులకు తినిపించారు. అనంతరం సీనియర్ ఫోటో జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతికత ఎంత అందుబాటులోకి వచ్చిన సహజమైన ఫోటోలకు ఎప్పటికీ విలువ గౌరవం ఉంటుందని అన్నారు. తనకు చిన్నతనం నుండి ఫోటోలు అంటే చాలా మక్కువ అని. పాత చిత్రాన్ని ఒకసారి చూసుకున్నప్పుడు మనసు పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోతుందని.. ఏదో తెలియని ఆనందం కలుగుతుందని అన్నారు. యాక్షన్ ఫోటోలు తీయడంలో తిరుపతి ఫోటో జర్నలిస్టులకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తనను సమాజానికి పరిచయం చేసిందే మీడియా రంగమని అందులో ప్రత్యేకించి ఫోటోగ్రాఫర్ల పాత్ర చాలా కీలకమైనదన్నారు. వారి సహకారాన్ని తాను ఎన్నడు మరువలేనని అన్నారు. ప్రొఫెషనల్ ఫోటో జర్నలిజంలో తిరుపతి ఫోటో జర్నలిస్టులు ఓ ప్రత్యేకత కలిగిన్నఉన్నారన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి, ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె గిరిబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కె రాధాకృష్ణ, ఆర్ లావణ్య కుమార్ లతోపాటు సీనియర్ ఫోటో జర్నలిస్టులు వీడియో జర్నలిస్టులు పాత్రికేయులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు దేవులపల్లి రామలింగం కన్నుమూత

### - చిన్న, మధ్య తరహా దినపత్రికల సంఘం నాయకుల తీవ్ర విచారం



**రాజమహేంద్రవరం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజానికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయుడు, వెలుగు పత్రిక సంపాదకుడు దేవులపల్లి రామలింగం(60) మంగళవారం కాకినాడలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కిర్కంపూడిలో జన్మించిన రామలింగం 1985లో ఆంధ్రభూమిలో పాత్రికేయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం డెక్కన్ క్రానికల్లో 1998 వరకు పనిచేశారు. తరువాత ఉదయం దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా చేరి మహబూబ్‌నగర్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు. 2002లో రాజమహేంద్రవరంలో వెలుగు పత్రికను ప్రారంభించి, అప్పటి నుంచి సంపాదకుడిగా కొనసాగారు. సూటిగా మాట్లాడే తత్వం, నిరాడంబర జీవనం, ధైర్యం, విస్తృత పరిజ్ఞానం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. జర్నలిజం కోసం తన వ్యక్తిగత ప్రయోజనాలను త్యజించిన రామలింగం, తన పూర్వీకుల ఆస్తిని సైతం పత్రిక నిర్వహణకు వినియోగించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడారు. సంపద కూడబెట్టకుండా పత్రికా రంగానికే తన జీవితాన్ని అంకితం చేశారు. ముద్రగడ పద్మనాభం, జక్కంపూడి రామ్మోహన్‌రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితర ప్రముఖులతో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉన్నాయి. రామలింగం మృతికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. నిరాడంబరత, నిజాయితీ, ధైర్యం, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచిన రామలింగం మరణం తెలుగు జర్నలిజం రంగానికి తీరని లోటని సహచర పాత్రికేయులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికల సంఘం దేవలపల్లి రామలింగం మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కె.ఎస్. రంగసాయి మాట్లాడుతూ, రామలింగం దశాబ్దాలుగా సంఘంతో అనుబంధం కలిగి ఉన్నారని, పలు సంవత్సరాలు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యునిగా సేవలు అందించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ రామలింగం మరణం సంఘానికి తీరని లోటని, సంఘం తరఫున వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తున్నామని ఆయన అన్నారు.

## దేవాదాయ శాఖకు రాజనాలబండ



**చౌడేపల్లి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండను దేవాదాయ శాఖకు అప్పగించారు. బుధవారం రెండు సంవత్సరాలుగా టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాలను ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ కు రికార్డులతో సహా అందించారు. దీనివల్ల స్థానికల్లో మిశ్రమ స్పందన వచ్చింది. టిటిడి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుంది అనుకున్న స్థానికులు అసంతృప్తికి లోనయ్యారు. రికార్డులు తోపాటు ఆదాయ వనరులు వంటి వాటిపై అవగాహన తీసుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖలోని గ్రూప్ టెంపుల్స్ పరిధిలోకి తీసుకువస్తామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. శ్రావణమాసంలో రాజనాల బండపై జరిగే తిరుణాళ్లను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు. కాగా రాజనాల బండ తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ఉన్నందున ఎండోమెంట్కు అప్పగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## గడువులోగా మిగిలిన ప్రక్రియలను పూర్తి చేయాలి: కలెక్టర్

### - సాధారణ ఎన్నికల నిర్వహణపై ఏపిఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్




**తిరుపతి,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికలకు ముందు నిర్వహించాల్సిన ప్రక్రియలు, పోలింగ్ కేంద్రాల తనిఖీలు, ఎన్నికల సామగ్రి లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 807 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 16 పంచాయతీలు కోర్టు కేసులకు సంబంధించిన అంశాల కారణంగా ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందని, మిగిలిన 791 గ్రామ పంచాయతీలకు నోటీసుల ప్రచురణ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల మార్కింగ్‌తో పాటు ఎన్నికలకు ముందు నిర్వహించాల్సిన ఇతర ప్రక్రియలు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు సుమారు 40 శాతం మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే జిల్లాలోని పోలింగ్ కేంద్రాల తనిఖీ ప్రక్రియ కూడా దాదాపు పూర్తయిందని, నిర్ణయించిన గడువు నాటికి మిగిలిన ప్రక్రియలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రి కొరతపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైన సామగ్రి కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇండెంట్ పంపినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాల్సిన సామగ్రి, రాష్ట్ర స్థాయి నుంచి సమకూర్చే సామగ్రిపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, జిల్లా స్థాయిలో ఎన్నికల సామగ్రి సమీకరణకు సంబంధించి స్పష్టమైన కమ్యూనికేషన్‌ను త్వరలో జారీ చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, సంబంధిత సీనియర్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమాచారాన్ని వేగంగా పరస్పరం పంచుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కూడా సమీక్షించారు. జిల్లాలో 6 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని, వాటిలో శ్రీకాళహస్తి పట్టణ స్థానిక సంస్థకు సంబంధించిన అంశాలపై ప్రస్తుతం ముందుకు వెళ్లే పరిస్థితి లేదని, మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని అధికారులు వివరించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి 68 గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు గత డిసెంబర్‌లో సమర్పించిన ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న విషయాన్ని కూడా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వ స్థాయిలో సమీక్ష జరుగుతోందని, అనంతరం జిల్లాకు సమాచారం అందిస్తామని రాష్ట్ర స్థాయి అధికారులు తెలిపారు. విలీన ప్రక్రియకు సంబంధించి తుది నిర్ణయం వచ్చే వరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాల్లో స్పష్టతతో ముందుకు సాగాలని, ఒకవేళ ఏదైనా కారణంగా విలీనం ప్రక్రియ పూర్తికాకపోతే సంబంధిత గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎన్నికలను నిర్వహించుకునే విధంగా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

## నెలాఖరు కల్లా చెత్త నిర్వహణ ప్లాంట్ అందుబాటులోకి తేవాలి: కమిషనర్



**తిరుపతి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకం వద్ద చేపట్టిన చెత్త నిర్వహణ ప్లాంట్ (ప్రాసెసింగ్ ప్లాంట్) నిర్మాణ పనులను నాణ్యతతో ఈ నెలాఖరు లోపు పూర్తి చెయ్ అందుబాటులోకి తేవాలని, పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను హెచ్చరించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ సుడిగాలి పర్యటన చేశారు. నగరంలో పారిశుద్ధ్య పనులతో పాటు తూకివాకంలో నిర్మిస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణ పనులను, తడి, పొడి చెత్త, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల పనితీరు, రామాపురం డంపింగ్ యార్డు వద్ద జరుగుతున్న చెత్త నిర్వహణ పనులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ముందుగా తూకివాకం వద్ద జరుగుతున్న వేస్ట్ ప్రాసెసింగ్ (చెత్త నిర్వహణ)ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల ఆలస్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయాల్సిన మేర పనులు జరగడం లేదని, పనిచేసే వారి సంఖ్య పెంచి, యంత్రాల వాడకాన్ని పెంచి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి చేసి, ప్లాంట్ ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్ట్ పనుల నిర్మాణంలో ఆలస్యం చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తడి, పొడి చెత్త ప్లాంట్లు, గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్ పనితీరును పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి లోతట్టు ప్రాంతాల్లో ఎత్తు పెంచడం, నూతన రోడ్లు ఏర్పాటు వంటి వాటిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రామాపురం వద్ద గల డంపింగ్ యార్డును పరిశీలించారు. ప్రతి రోజు ఎంత చెత్త నిర్వహణ చేస్తున్నారు, ఎందుకు వినియోగిస్తున్నారు, ఇంకా ఎంత చెత్త ఉంది, ఇప్పటి లోపు పూర్తి అవుతుందనే విషయాలను తెలుసుకుని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని రోజుల్లో జరగాల్సినంత పని జరగక పోవడం పట్ల నిర్వాహక సిబ్బందిని మందలించారు. ఇప్పటి వరకు ఉన్న మొత్తం చెత్త సెప్టెంబర్ మూడవ వారానికల్లా నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లాంట్ లో ఏరోజుకారోజు చేసిన పనిని రికార్డ్ చేసి సంబంధిత అధికారులను అప్పగించాలని నిర్వాహకులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## అయ్యప్ప స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి



**పుంగనూరు,ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ఈనెల 18 మంగళవారం అయ్యప్ప స్వామి దీక్షలో భాగంగా గణపతి హోమం నిర్వహించి, ఇరుముడి కట్టుకొని శబరిమలై యాత్రకు బయలు దేరారు. ఈ సందర్భంగా వారు కాలినడకన శబరిమలై చేరుకుని పవిత్రమైన 18 మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం అయ్యప్ప మాల ధరించి అయ్యప్ప కొండకు వచ్చిన వైసిపి నాయకులు కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## రేణుకమ్మకు అండగా అభినయ్ రెడ్డి

**తిరుపతి, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అధర్మంపై ధర్మ పోరాటం చేస్తున్న రేణుకమ్మకి అండగా నిలిచిన తిరుపతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్ రెడ్డి తిరుపతి టీడీపీ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాస్ అక్రమంగా తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారని ఆరోపిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్‌కు మద్దతుగా ఆయన తల్లి రేణుకమ్మ బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. రేణుకమ్మ నిరాహార దీక్షను భగ్నం చేసి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అరెస్ట్ అయిన రేణుకమ్మని పరామర్శించి, ఆమెకు భూమన అభినయ్ రెడ్డి తన సంపూర్ణ మద్దతు తెలిపారు. అదేవిధంగా అరెస్ట్ అయిన మాజీ మేయర్ డాక్టర్ శిరీష యాదవ్‌కి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు బాసటగా నిలిచి వారికి అండగా ఉన్నారు. అనంతరం మీడియాతో భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. అధర్మానికి వ్యతిరేకంగా న్యాయం కోసం పోరాడుతున్న రేణుకమ్మ పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## కరెంట్ బిల్లును ఆన్‌లైన్‌లో కట్టండి

**రామసముద్రం, ఆగస్టు 19 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారులు బిల్లులను ఆన్‌లైన్‌లోనే చెల్లించుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏడీ వై.హరికుమార్, ఏఈ మస్తాన్‌వల్లి సూచించారు. ఫోన్‌పే, గూగుల్‌పేతో పాటు ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇంటి నుంచే బిల్లులు చెల్లించుకోవచ్చన్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. బిల్లు చెల్లించిన అనంతరం రసీదును ఫోన్‌లో భద్రపరచుకోవాలని సూచించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027